
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





జలకళ సంతరించుకోని నెల్లికుదురు మండలంలోని ఓ చెరువు

వానలు అంతంతే..

- జూలైలో 12 మండలాల్లో సాధారణ వర్షం
- కేవలం మూడుచోట్ల మాత్రమే అధికంగా వానలు
- మరో మూడు మండలాల్లో లోటు వర్షపాతం
- 341 చెరువుల్లోకి ఇంకా నీరురాలె
- ఆకాశం వైపు చూస్తున్నరైతులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు2 : ఈ ఏడాది జూన్‌లో వర్షాలు అంతంతమాత్రమే కురియడంతో చెరువులు నిండక యావత్ రైతాంగం జూలై పైనే ఆశలు పెంచుకుంది. అయితే జూన్ మాసంలోనూ వానలు సమృద్ధిగా పడకపోవడంతో అన్నదాత ఆకాశం వైపు చూస్తూ, వరణుడి కరుణ కోసం పడిగాపులు కాస్తున్నాడు. సదరు నెలలో సాధారణ వర్షపాతమే ఉండడంతో చెరువులు యథారీతిన వెలవెలబోతున్నాయి. ప్రతీరోజు జిల్లాలో ఎక్కడో.. ఓచోట చినుకుల పలకరింపు మినహా భారీగా కురిసిన వర్షాలు లేవు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలకు తోడు ఏజెన్సీ మండలాలైన కొత్తగూడ, గంగారం, గూడూరులలో కాస్త మెరుగ్గా వర్షాలు పడడంతో ఆ ప్రాంత రైతాంగం వ్యవసాయంపై కాస్తో.. కూస్తో ఆశలు పెంచుకుంది. మినహా ఇతరత్రా మండలాల్లో చెరువులు నిండక పంటలు వేయడానికి రైతులు వెనక.ముందు ఆలోచన చేస్తున్నారు.

జూలైలో ఇలా..

గత జూన్ నెలలో 141.6 మిల్లీమీటర్ల సాధారణ వర్షం కురియాల్సి ఉండగా 185.7 మిల్లీమీటర్ల వర్షంపాతం కురిసింది. దాదాపు 44 శాతం అధికంగా వర్షం కురిసింది. జూన్ నెలలో అతికొద్దిగా ఎక్కువగా కురిసినప్పటికి నీరు భూమిలోనే ఇంకిపోయింది. కొన్ని మండలాల్లోని చెరువుల్లో అంతో కొంతో నీరు చేరగా, మరి కొన్ని మండలాల చెరువుల్లో నీరు చేరలేదు. ఈ జూలై నెలలో భారీగా వర్షాలు కురుస్తాయని రైతులు ఎంత ఆశగానో ఎదురుచూశారు. ఈ జూలై నెలలో మొత్తం 25 రోజుల పాటు వర్షం కురిసినప్పటికి జూలైలో జిల్లాలోని 12మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. అయితే కొత్తగూడ మండలంలో 53 శాతం ఎక్కువ వర్షం కురియగా గంగారంలో 34 శాతం, మరిపెడలో 48 శాతం అధిక వర్షం కురిసింది. బయ్యారం, గార్ల, డోర్నకల్, గూడూరు, కేసముద్రం, నర్సింహులపేట, చిన్నగూడూరు, దంతాలపల్లి, తొర్రూరు, పెద్దవంగర, సీరోలు, ఇనుగుర్తి మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. కురవి మండలంలో 24 శాతం లోటు వర్షపాతం నమోదు కాగా, మహబూబాబాద్ మండలంలో 11 శాతం, నెల్లికుదురులో 22 శాతం లోటు వర్షపాతం నమోదైంది.

చెరువుల్లోకి చేరని నీరు..

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కొన్ని మండలాల్లోని వాగులకు నీరు ప్రవహిస్తుండగా మరి కొన్ని మండలాల్లోని చెరువుల్లోకి నీరురాక రైతులు పరేషాన్‌కు గురవుతున్నారు. జిల్లాలో 1,590 చెరువులు ఉండగా 341 చెరువుల్లోకి 0-25 శాతం లోపే నీరు చేరింది. 25-50 శాతం వరకు 328 చెరువులు, 50-75 శాతం వరకు 92 చెరువులు, 75-100 శాతం వరకు 215 చెరువుల్లోకి నీరు చేరగా, 614 చెరువులు మాత్రం అలుగులు పోశాయి. బయ్యారంలో 98 చెరువులకు 88 చెరువులు నిండగా 10 చెరువులు అలుగులు పడ్డాయి. కొత్తగూడలో 380 చెరువులకు 380 చెరువులు అలుగులు పడగా, గంగారంలో 214 చెరువులకు 214 చెరువులు అలుగులు పోశాయి. ఇదిలా ఉండగా గూడూరు మండలంలోని 122 చెరువులు ఉండగా 63 చెరువుల్లోకి కేవలం 25 శాతం వరకే నీరు చేరింది.

డోర్నకల్‌లో 69 చెరువులు ఉండగా 45 చెరువులు, కేసముద్రంలో 53 చెరువులు ఉండగా 38 చెరువులు, మరిపెడలో 69 చెరువులుండగా 20 చెరువుల్లోకి, నర్సింహులపేటలో 46 చెరువులకు 27 చెరువుల్లోకి, సీరోలులో 48 చెరువులు ఉండగా 22 చెరువుల్లోకి, తొర్రూరులో 58 చెరువులు ఉండగా 24 చెరువులు, పెద్దవంగరలో 37 చెరువులు ఉండగా 27 చెరువులకు, కురవిలో 76 చెరువులు ఉండగా 12, చిన్నగూడురులో 24 చెరువులకుగాను 23 చెరువుల్లోకి నీరు చేరలేదు. భారీ వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

141.2 మిల్లిమీటర్ల వర్షపాతం

జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు కొన్నిచోట్ల ఓ మోస్తారు వర్షం కురిసింది. బయ్యారం, నెల్లికుదురు, గంగారం, మహబూబా బాద్, గార్ల, తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో ఓ మోస్తారు వాన పడింది. జిల్లాలోని కొత్తగూడలో 7.4 మిల్లిమీటర్ల, గంగారంలో 14.2, బయ్యారంలో 12.4, డోర్నకల్‌లో 3.0, కురవిలో 4.8, మహబూబాబాద్‌లో 14.4, గూడూరు లో 4.0, కేసముద్రంలో 0.8, నెల్లికుదురులో 18.8, నర్సింహులపేటలో 4.0, చిన్నగూడూరులో 2.0, మరిపెడలో 5.2, దంతాలపల్లిలో 5.6, తొర్రూరులో 12.4, పెద్దవంగరలో 13.2 మిల్లిమీటర్ల వర్షపాతం కురిసింది. మహబూబాబాద్ జిల్లాలో వెరసి 141.2 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 8.8 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది.

పిల్లలతో పనిచేయిస్తే కఠిన చర్యలు

- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 2 : బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం తెలంగాణ రాష్ట్ర పోలీస్‌శాఖ వివిధ శాఖల సహకారంతో ఏటా రెండుసార్లు ఆపరేషన్ స్మైల్ (ఆపరేషన్ ముస్కాన్) నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నపిల్లలతో పనిచేయిస్తున్న ఐదుగురు యాజమానులపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్‌ను ఏఎస్పీ జోగుల చెన్నయ్య ఆధ్వర్యంలో 20 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించడం జరిగిందన్నారు. అందులో ఇద్దరు బాలికలు, 18 మంది బాలురు ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ, సీడీపీవో వారికి అప్పగించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరిచి బాలలతల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న సమస్యల్లో బాలకార్మిక వ్యవస్థ ఒకటని చెప్పారు. ఐదు నుంచి 14ఏళ్లలోపు ఉన్న పిల్లలను బాలకార్మికులుగా పరిగణిస్తామన్నారు. పరిశ్రమలు, ఇటుక బట్టీలు, హోటళ్లు, రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్‌లలో బిక్షాటన చేస్తున్న, ఆయాషాపుల్లో బాలకార్మికులుగా పనిచేస్తున్న వారిని గుర్తించడం జరిగిందన్నారు. ఎవరైనా బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే డయల్ 100, చైల్డ్‌లైన్ 1098 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.



ఏసీబీకి పట్టుబడిన ఎస్సై వెంకన్న (సర్కిల్), డ్రైవర్

ఏసీబీ వలలో ఎస్సై

- 'స్టేషన్ బెయిల్' ఇచ్చేందుకు రూ.70వేలు డిమాండ్
- రూ.40 వేలు తీసుకుంటూ దొరికిన వెంకన్న
- ఎస్సైతో పాటు డ్రైవర్ అరెస్టు

8

'స్వచ్ఛదనం-పచ్చదనం'ను సక్సెస్ చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక కార్యాచరణతో 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. అందుకు అవసరమైన యాక్షన్‌ప్లాన్‌ను అధికారులు రూపొందించాలని అన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి 9 వరకు నిర్వహించే 'స్వచ్ఛదనం- పచ్చదనం'యాక్షన్ ప్లాన్‌పై కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం అన్నిశాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం' విజయవంతం చేయడానికి అన్నిశాఖల అధికారులు ప్రత్యేక కార్యాచరణతో పనులు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని ప్రతీ గ్రామం, పట్టణంలో ఐదు రోజుల్లో ఎక్కడెక్కడ ఏ పనులు చేపడుతారో ఆ పనుల యొక్క యాక్షన్‌ప్లాన్, రోజువారీగా చేసే పనుల నివేదికలను పంపాలన్నారు. విద్య, వైద్య, సంక్షేమ, పంచాయతీ, ఆర్‌అండ్‌బీ, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛందసంస్థలు, స్వయం సహాయక బృందా ల ప్రమేయంతో కార్యాచరణ పకడ్బందీగా అమలు చేయాలన్నారు అనంతరం పలు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈనెల 5న అన్ని గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, డీఎఫ్‌వో బత్తుల విశాల్, జిల్లా అధికారులు నర్మద, వరలక్ష్మి, కిరణ్‌కుమార్, నర్సింహాస్వామి, సుబ్బారావు, సురేష్, హరిప్రసాద్, అభిమన్యుడు, మరియన్న పాల్గొన్నారు.

నేడు సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభం

జిల్లాలో ఈనెల 3న ఉదయం 11:30 గంటలకు అన్ని మీసేవవా కేంద్రాల్లో సదరం క్యాంపుల స్లాట్ బుకింగ్ ప్రారంభమవు తుందని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరం సర్టిఫికేట్లు కావాల్సిన దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకుని వారికి వచ్చిన తేదీన జిల్లా జనరల్ ఆస్పత్రిలో జరిగే సదరం క్యాంపును హాజరు కావాలని సూచించారు.



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, అధికారులు

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

- ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చోంగ్తు

మహబూబాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చోంగ్తు అన్నారు. హైదరాబాద్ సచివాలయం నుంచి శుక్రవారం ఉన్నతాధికారులతో కలిసి జిల్లాల్లోని మునిసిపల్, వైద్యశాఖ అధికారులతో సీజనల్ వ్యాధుల పట్ల తీసుకుంటున్న చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు అన్నిచర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య నిర్వహణ పనులను సక్రమంగా చేపట్టి డెంగీ, చికెన్ గున్యా, మలేరియా లాంటివ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేకశ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు నీటి ట్యాంకులను శుభ్ర పరిచి క్లోరినేషన్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. నీరునిల్వ ఉండకుండా చూసుకోవాలని, నీరునిల్వ ఉన్న చోట ఆయిల్‌బాల్స్‌ను వేయాలని చెప్పారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని లైన్ డిపార్ట్‌మెంట్ వారితో ఖచ్చితంగా నిర్వహించాలన్నారు. సబ్‌సెంటర్లలో డెంగీ పరీక్షల ర్యాపిడ్‌కిట్‌లు అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, మునిసిపల్ కమిషనర్లు నోముల రవీందర్, నరేష్‌రెడ్డి, వెంకట స్వామి, మలేరియా ప్రోగ్రాం అధికారి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం

- కాగితాల్లోనే నిధుల మంజూరు
- కాంగ్రెస్ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు



కలెక్టరేట్ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 2 : తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యమని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. నిధుల మంజూరు కేవలం జీవో కాగితాలకే పరిమితమయ్యాయి తప్ప, అభివృద్ధికి కేటాయించిన డబ్బులు విడుదల కాలేదని ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లా సమగ్రాభివృద్ధి డిమాండ్‌తో సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ సెంటర్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో ప్రజలకు మేలు జరిగింది ఏమిలేదన్నారు. రాష్ట్రంలో నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లా సమగ్రాభివృద్ధి కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల అభివృద్ధి కోసం రాష్ట్రప్రభుత్వం రూ.200 కోట్లు విడుదల చేయాలని కోరారు.

బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుపై నిర్లక్ష్యం?

విభజన చట్టంలోని బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయకుండా కేంద్రప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందని తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ప్రశ్నించారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు జరిగితే అనేక మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. గతంలో రాష్ట్రం నుంచి బీజేపీకి నలుగురు ఎంపీలుంటే ఇప్పుడు ఏనిమిది మందికి పెరిగారని అయినప్పటికి ఉక్కు ఫ్యాక్టరీని సాధించడంలో విఫలమయ్యారని చెప్పారు. గార్ల-రాంపురం వద్ద హైలెవల్ బ్రిడ్జీని నిర్మించాలని, కురవి, అనంతారంలను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరారు. తొర్రూరు డివిజన్ కేంద్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలిచ్చి వారిని ఆదుకోవాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందించారు. జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సహాయ కార్యదర్శులు బి.అజయ్‌సారథిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, మామిండ్ల సాంబలక్ష్మి, పాండు రంగాచారి, నాగేశ్వర్‌రావు, పోగుల శ్రీనివాస్, సందీప్, శేఖర్, వెలుగు శ్రావణ్, నక్క నాగార్జున, రవీందర్, రవి, మేక వీరన్న, మంద శంకర్, తండా సందీప్ తదితరులు పాల్గొన్నారు.

తాండేమా బోరాయి తీజ్

- ప్రకృతి పరవశించే సంప్రదాయ ఉత్సవం
- నేటినుంచి నుంచి 11వతేదీ వరకు వేడుకలు
- తొమ్మిది రోజులు తండాల్లో సందడే సందడి
- ఆటపాటలతో గిరిజనుల్లో జోష్
- ఒకేసారి నిర్వహించుకోవాలని గిరిజనుల యోచన

7







స్కూటీతో ఢీకొట్టిన వ్యక్తిపై చర్య తీసుకోవాలి

వరంగల్ క్రైం, ఆగస్టు 2: తన తండ్రి సిలువేరు వీరస్వామిని స్కూటీ అతి వేగంగా నడుపుకుంటూ వచ్చి ఢీకొట్టిన ఎం.భరత్‌పై చర్య తీసుకుని న్యాయం చేయాలని సిలువేరు పున్నం శుక్రవారం హసన్‌పర్తి పోలీసులకు పిర్యాదు చేశారు. కూలీపని చేసే తన తండ్రి గత నెల 24న గ్రామంలో ఒకరి ఇంటివద్ద పని చేస్తుండగా వేగంగా వచ్చిన భరత్ ఢీకొట్టడంతో కాలుకు తీవ్ర గాయమైందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నామని, తీవ్ర గాయం కావడంతో కాలు తొలగించే పరిస్థితి వచ్చిందని తెలిపారు. తన తండ్రిని ఢీకొట్టిన భరత్‌పై చర్య తీసుకుని న్యాయం చేయాలని పున్నం కోరారు.



గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు


వరంగల్ క్రైం, ఆగస్టు 2: గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 80 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఓఆర్‌ఆర్‌పై పెట్రోలింగ్ చేస్తుండగా టోల్ ప్లాజా వద్ద ముగ్గురు యువకులు కారులో గంజాయి సేవిస్తూ అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను గమనించిన యువకులు పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకుని ప్రశ్నించగా గంజాయి కలిగి ఉన్నట్లు గుర్తించారు. పి.కృష్ణారెడ్డి, సాయిపవన్, పి.అరవింద్ అనే ముగ్గురు యువకులను అరెస్టు చేసి కారు, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఎస్ఐ రవిందర్ ధృవీకరించారు.

● ఐనవోలు : ఎండు గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కొండపర్తి గ్రామానికి చెందిన బుంగ కల్యాణ్ ఆటోలో వచ్చి పోలీసులను చూసి పరిగెత్తే ప్రయత్నం చేశాడు. ఆటోను తనిఖీ



హనుమకొండలోని ఓఆర్‌ఆర్‌పై పట్టుబడిన ముగ్గురు యువకులు


చేయగా ఒక ప్లాస్టిక్ కవర్‌లో 100 గ్రాముల ఎండు గంజాయి లభించింది. దీని విలువ సుమారు రూ.2,500 వరకు ఉంటుంది. ఆటోతోపాటు సెల్‌ఫోన్, గంజాయిని స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుచగా నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.















అమెరికా రోడ్డు ప్రమాదంలో గుండ్రాతిమడుగువాసి మృతి

▸▸ స్వగ్రామంలో రోహిత్‌రెడ్డి అంత్యక్రియలు పూర్తి


రోహిత్‌రెడ్డి (ఫైల్)

కురవి, ఆగస్టు 2: మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన బండి రోహిత్‌రెడ్డి(27) అమెరికాలోని టెక్సాస్‌లో జూలై 24న మృతి చెందాడు. ఏప్రిల్ 27న టెక్సాస్‌లో తన స్నేహితులతో కలిసి కారులో వెళ్తుండగా మరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో రోహిత్‌రెడ్డి తలకు తీవ్రగాయాలై కోమాలోకి వెళ్లాడు. చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతదేహాన్ని శుక్రవారం ఉదయం విమానంలో హైదరాబాద్‌కు తీసుకురాగా, స్వగ్రామమైన గుండ్రాతిమడుగుకు మధ్యాహ్నం తీసుకువచ్చారు. రెండు గంటలకు రోహిత్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, బండి అనిల్‌రెడ్డి-అనితారెడ్డి దంపతులకు రోహిత్‌రెడ్డి, రోహన్‌రెడ్డి కుమారులు. పెద్ద కుమారుడు రోహిత్‌రెడ్డి కాగా, అవివాహితుడు. ఇద్దరు అన్నదమ్ములు ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. కుమారుడి మృతదేహం చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. అంత్యక్రియల్లో జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి, సొసైటీ ఛైర్మన్ గార్లపాటి వెంకట్‌రెడ్డి, భరద్వాజ్‌రెడ్డి, బండి అజయ్‌రెడ్డి, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

వరంగల్ క్రైం, ఆగస్టు 2: తన భర్త, అత్త కనిపించడం లేదని హసన్‌పర్తికి చెందిన పి.సాయిశివాని శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత నెల 17న తనతో భర్త మణిదీప్, అత్త గొడవపడి పుట్టింటికి వెళ్లగొట్టినట్లు తెలిపారు. తిరిగి తల్లిదండ్రులతో 22వ తేదీన రాగా, భర్త, అత్త ఇంట్లో లేరని, ఇంటికి తాళం వేసి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సెల్‌ఫోన్లు స్విచ్‌ఆఫ్‌లో ఉన్నాయని, బంధువులు, తెలిసిన వారి ఇళ్లకు తిరిగినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు.

తాండేమా బోరాయి తీజ్

- **ప్రకృతి పరవశించే సంప్రదాయ ఉత్సవం**
- **నేటి నుంచి 11 వరకు వేడుకలు**
- **తొమ్మిది రోజులు తండాల్లో సందడే సందడి**
- **ఆటపాటలతో గిరిజనుల్లో జోష్**
- **ఒకేసారి నిర్వహించుకోవాలని గిరిజనుల యోచన**
- **తీజ్ పండుగకు గుర్తింపు ఇవ్వాలని బంజారాల డిమాండ్**

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 2: గోర్ బంజారాలు సంస్కృతి, సంప్రదాయబద్ధంగా.. ప్రకృతి పరవశించే విధంగా ఏడుగురు కుల దేవతల్లో ఒకరైన మేరామాయాడిని స్మరిస్తూ మేరమా మాత అనుగ్రహంతో జన్మించిన సేవాలాల్ మహారాజ్‌ను మనసారా కొలిచి వేడుకలు నిర్వహిస్తారు. పాడిపంటలు, పిల్లపాప, పశువులు చల్లాగా ఉండేలా దీవించాలని లంబాడ గిరిజనులు భక్తిశ్రద్ధల నడుమ గోధుమ నారుపోసి, గడ్డి బతుకమ్మతో తీజ్ పండుగను జరుపుకుంటారు. ఏటా శ్రావణ మాసంలో తొమ్మిది రోజుల పాటు వారి వెసులుబాటును బట్టి ఉత్సవాలు నిర్వహిస్తారు. పూర్వకాలంలో నిరక్షరాస్యులైన గిరిజనులు వ్యవసాయ సీజన్‌ను అంచనా వేయడానికి వర్షాకాల ఆరంభం అనంతరం వరినాట్లు పూర్తిచేసుకొని తీరిక సమయాల్లో తీజ్ పండుగకు సన్నద్ధమవుతారు. ఈ ఆచార సంప్రదాయ పండుగలు నేటికి కొనసాగుతూ వస్తున్నాయి. ఇక ఈ ఏడాది శనివారం నుంచి ప్రారంభం కానున్న వేడుకలు 11 వరకు తొమ్మిది రోజులపాటు కొనసాగనున్నాయి. ఒకేసారి ఈపండుగను నిర్వహించుకోవాలని గిరిజనులు యోచిస్తున్నారు. తీజ్ పండుగను ప్రభుత్వం అధికారికంగా గుర్తించి సెలవుదినంగా ప్రకటించాలని గిరిజనులు కోరుతున్నారు.

తీజ్ నేపథ్యం ఇదీ..

గోర్ బంజారాలు శ్రీసేవాలాల్ మహారాజ్, దండి మేరామ మాతను దైవ దూతలుగా కొలుస్తారు. తండాల్లోని పెళ్లి కాని అమ్మాయిలు తమ తల్లిదండ్రులకు పంటలు బాగా పండాలని, అభివృద్ధి చెందాలని భావిజీవితం సవ్యంగ కొనసాగాలని భార్యాభర్తల మధ్య ఉండే ప్రేమానురాగాలు మరింతగా బలపడాలని పార్వతీదేవి శివునిప్రేమ పొందడానికి 107 జన్మలెత్తి 108వ జన్మలో శివున్ని భర్తగా పొందిన రోజు గుర్తుగా ఈ తీజ్ పండుగను నిర్వహిస్తారని ఇతిహాసాలు పేర్కొంటున్నాయి. ఈ దేవతను కొలుస్తూ కన్నెలు ఎన్నోవిధాలుగా అభ్యరిస్తూ శ్రావణమాసంలో తొమ్మిది రోజుల పాటు ఈ పండుగను నిర్వహిస్తారు. ఉత్తర భారతదేశంలో తీజ్ పండుగను పెళ్లయిన మహిళలు నిర్వహిస్తారు. తమ భర్తల నుంచి ప్రేమానురాగాలు పొందడానికి ఈ పండుగను జరుపుకోవడం విశేషం.


గుండ్లబోడు తండాలో తీజ్ బుట్టపై నీరు పోస్తున్న బాలిక (ఫైల్)

తొమ్మిదో రోజు ఇలా..

తొమ్మిదో రోజును బంజారాలు అత్యంత భక్తిశ్రద్ధల నడుమ తీజ్ ఘనంగా నిర్వహించుకుంటారు. తీజ్ నిమజ్జనానికి బంధు, మిత్రులందరినీ ఆహ్వానిస్తారు. అత్యంత పవిత్రంగా మేరామ మాతను, సేవాలాల్ మహారాజ్‌కు పూజలు చేస్తారు. డప్పు చప్పుళ్లతో గిరిజన సంస్కృతి సంప్రదాయం ప్రకారం పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ తొమ్మిదో రోజు ఘనంగా నిర్వహిస్తారు. ఆడపిల్లలు పెంచిన తీజ్‌ను తండానాయక్ పరిశీలించి ఒక్కొక్క బుట్టను ఆడ పిల్లలకు అందజేస్తారు. తమను ఆపదల నుంచి రక్షించాలని అన్నాదమ్ములకు నారు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకుంటారు. ఈ గోధుమ నారు అత్యంత పవిత్రమైందని. దీనివల్ల శుభం జరుగుతుందని నమ్మకం. తీజ్ బుట్టలను పట్టుకుని వరసగా నిమజ్జనానికి డప్పుచప్పుల్లతో బయలుదేరుతారు. ఆటా..పాటలు కేరింతలతో ఆనంద భరితంగా ఈ నిమజ్జన వేడుక కొనసాగుతుంది. చెరువు దగ్గర ఈ తీజ్ నిమజ్జనం ఓ అద్భుతమైన సన్నివేశం జరుగుతుంది. తీజ్ తమను వదలివెళ్లి పోతుందనే దుఃఖంతో ఆడపిల్లలు ఏడుస్తుంటే పెద్దలు, సోదరులు వారిని ఊరడిస్తుంటారు. జీవితాంతం నీకు తోడుగా ఉంటూ రక్షిస్తానని చెల్లెల్ని పీటపై నిల్చోపెట్టి కాళ్లను కడిగి సోదరుడు పాదాభివందనం చేస్తాడు. ఆ తర్వాత చెరువులో తీజ్‌ను నిమజ్జనం చేస్తారు.


తీజ్ బుట్టలను నిమజ్జనానికి తీసుకువెళ్తున్న గిరిజన మహిళలు (ఫైల్)

ఈ ఏడాది తీజ్ పండుగ వివరాలు..

లంబాడ గిరిజనులు ఎంతో భక్తిశ్రద్ధల నడుమ జరుపుకునే తీజ్ పండుగను ఒకేసారి జరుపుకోవాలని గిరిజన పెద్దలు తేదీలు ఖరారు చేశారు. ఈ ఏడాది తొమ్మిది రోజుల పాటు తీజ్ వేడుకలు నిర్వహించుకొని గిరిజనులు ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. తొలి రోజు శనివారం గోధుమలు నానబెట్టడం, ఆదివారం తీజ్ బుట్టలో వేయుట, 5న సోమవారం బోరడి తీజ్, 9న డమోలీ తీజ్, 10న ఘనగోర్ తీజ్, చివరి రోజు 11న నిమజ్జనం చేసేందుకు తేదీలను ప్రకటించారు. వివిధ తండాలకు చెందిన గిరిజనులు ఆయా తేదీల్లో తీజ్ పండుగను జరుపుకోవాలని సూచించారు.


మహబూబాబాద్ శివారు తండాలో తీజ్ బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం (ఫైల్)

తీజ్ పండుగకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలి
డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్, మహబూబాబాద్



గోర్ బంజార సంస్కృతి కూడా భారతదేశ సంస్కృతిలో అంతర్భాగమే. భారతీయ సంస్కృతులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. తెలుగురాష్ట్రాల్లో లంబాడీ గిరిజనులు మాత్రమే నిర్వహించుకునే తీజ్ పండుగను శనివారం నుంచి 11 వరకు ఒకే కాలంలో నిర్వహించుకొని జాతీ ఐక్యతను చాటుకోవాలి. ప్రభుత్వాలు కూడా 9 రోజులు నిర్వహించే తీజ్ పండుగలో పవిత్రరోజైన డమోళీ తీజ్ (7వ రోజు శుక్రవారం) సెలవు ప్రకటిస్తే చివరి మూడురోజులు (డమోళీ తీజ్, గణగోర్ తీజ్, కడావ్ తీజ్) ఘనంగా నిర్వహించి తీజ్ పండుగ ప్రాముఖ్యతను భావి తరాలకు అందించడానికి వీలుంటుంది.

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక
గుగులోతు కిషన్‌నాయక్, గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకుడు మానుకోట



లంబాడ గిరిజనులు ఏటా నిర్వహించుకునే తీజ్ పండుగ గిరిజన సంప్రదాయం, భక్తిభావం, క్రమశిక్షణతో పాటు అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతిరూపంగా నిలుస్తోంది. నిజజీవితంలో ఆడపిల్లలకు కష్టాలు ఎదురైనప్పుడు నీ కష్టాల్లో తోడుగా నేనున్నాని(అన్న) భరోసా, మనోధైర్యం కల్పించే పండుగ తీజ్. ప్రతి ఏటా తీజ్ నిమజ్జనం రోజు చెరువు దగ్గర చెల్లెలిని పీటపై నిల్చోబెట్టి సోదరులు కాళ్లు కడిగి పాదాభివందనం చేస్తారు. ఈ బంధం కలకాలం ఇలాగే ఉండాలని సోదరులను చెల్లెళ్లు ఆశీర్వదించడం ఆనవాయితీగావస్తోంది.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



కాజీపేట, ఆగస్టు 2: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట - పెండ్యాల రైల్వేస్టేషన్‌ల మధ్య గురువారం రాత్రి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వయస్సు 30 - 35 సంవత్సరాలలోపు ఉంటుంది. ఎత్తు 5.7 ఛామన ఛాయ రంగు, నలుపు రంగు ప్యాంటు, గులాబీ రంగు చొక్కా ధరించి ఉన్నాడు. మృతుడిని గుర్తించడానికి ఎలాంటి ఆనవాళ్లు లేవు. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు మృతదేహన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్ నంబర్ 87126 58609 సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య


రాజు మృతదేహం

భీమదేవరపల్లి, ఆగస్టు 2: భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామంలో కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు కథనం ప్రకారం.. మల్లారం గ్రామానికి చెందిన దండెం రాజు(27) సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మంచినీళ్లబండ గ్రామానికి చెందిన రవళితో 8 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లున్నారు. భార్యభర్తల మధ్య తరుచూగా గొడవలు జరుగుతున్నాయి. గత నెల 25న భర్తతో గొడవ పడి రవళి తన పుట్టింటికి వెళ్లింది. రాజు అప్పటి నుంచి తన భార్యను తన ఇంటికి రావాల్సిందిగా పలుమార్లు ఫోన్లు చేశాడు. కానీ రవళి తన పుట్టింటి వద్దనే ఉంటుంది. పిల్లలని చూడాలని ఉందని, కోరినా రవళి స్పందించలేదు. దీంతో నిరాశకు గురైన భర్త రాజు గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి లింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు తెలిపారు.

కెమిస్ట్రీలో బానోతు రెడ్డికి డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 2: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ బానోతు రెడ్డి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు ఏపీలోని మచిలీపట్నంలోని కృష్ణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు డాక్టరేట్ ప్రకటించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. క్యాన్సర్ కణాల నిర్మూలకు చేసిన విలువైన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేశారు. 'సింథసిస్ ఆఫ్ టెట్రాజోన్ ఫ్యూజ్డ్ ఇమీడాజో పిరడిన్స్ అనే అంశంపై కృష్ణ వర్సిటీ కెమిస్ట్రీ విభాగాధిపతి, రెక్టార్ ఎంవీ భసవేశ్వరరావు పర్యవేక్షణలో బానోతు రెడ్డి పరిశోధన గ్రంథాన్ని పూర్తి చేశారు. డాక్టరేట్ సాధించిన బానోతు రెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బొలగాని రాములు, ఇతర అధ్యాపకులు అభినందించారు.

ముగ్గురు గురుకుల విద్యార్థులకు అస్వస్థత

- **ఒకరికి విషపురుగు కుట్టినట్లు నిర్ధారణ**
- **మరో విద్యార్థి పరిస్థితి విషమం**
- **బండారుపల్లి తెలంగాణ గురుకులంలో ఘటన**

ములుగు, ఆగస్టు 2: 12గంటల వ్యవధిలో ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురికాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ములుగు జిల్లాలోని ములుగు మండలం బండారుపల్లి తెలంగాణ బాలుర గురుకులంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలీవిధంగా ఉన్నాయి. గురువారంరాత్రి నిద్రకు ఉపక్రమించే సమయంలో 8వ తరగతి విద్యార్థి శ్రీకర్ కాళ్లు తిమ్మిరెక్కడంతో ఇబ్బంది పడ్డాడు. ఉపాధ్యాయులు వెంటనే బాలున్ని ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స తర్వాత ఎంజీఎంకు తీసుకువెళ్లారు. విషపురుగు కుట్టినట్లు గుర్తించిన వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం శ్రీకర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. ఇదేక్రమంలో శుక్రవారం తెల్లవారుజామున 5గంటలకు వెంకటాపూర్(రామప్ప) మండలం కేశవాపూర్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి ప్రణయ్ కడుపునొప్పితో బాధపడుతుండగా ములుగు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స తర్వాత ఉపాధ్యాయులు హనుమకొండ జిల్లా ఆరెపల్లి వద్దగల ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ప్రణయ్ కోలుకున్నాడు. ఉదయం8గంటల సమయంలో పాఠశాల మైదానంలో ప్రార్థన జరుగుతుండగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థి కార్తీక్ స్పృహతప్పి పడిపోయాడు. హుటాహుటిన అతన్ని ఏరియా వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమించడంతో వెంటనే హనుమకొండకు ఉపాధ్యాయులు తరలించారు. ప్రస్తుతం కార్తీక్ ఆరోగ్యం ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. గంటల వ్యవధిలోనే ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురికావడం, ఒకరి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తోటి విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. కాగా, గురుకులంలో చదువుతున్న తమ పిల్లలు ఎలా ఉన్నారోనని తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు ఫోన్‌లు చేసి వాకబు చేశారు.


బండారుపల్లిలోని తెలంగాణ బాలుర గురుకులం

5న గిరిజన గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

హనుమకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని యాకుబ్‌పుర గిరిజన బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 5వ తేదీన తక్షణ(స్పాట్) ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి వెంకటేశ్వరరాజు, ప్రిన్సిపాల్ జి.రామ్మోహన్ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ-15, బీపీసీ 21, 5 తరగతిలో 6, అలాగే 9వ తరగతిలో 8 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల గిరిజన బాలురు ఉదయం 10గంటలకు వరంగల్‌లోని యాకూబ్‌పుర గిరిజనబాలుర గురుకుల పాఠశాలలో హాజరు కావాలన్నారు. వివరాలకు 9490957296 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునని తెలిపారు.

బాలికల పాఠశాలలో..

హనుమకొండ దేవన్నపేటలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 2024-25 సంవత్సరానికిగాను 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో సీట్ల ఖాళీల భర్తీకి ఈనెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కోరే జ్యోత్స్న తెలిపారు. 5వ తరగతిలో 3 (ఎస్టీ కేటగిరి), ఎంపీసీ మొదటి సంవత్సరంలో 4 సీట్లు (ఎస్టీ కేటగిరి) ఖాళీగా ఉన్నాయని తెలిపారు. స్పాట్ అడ్మిషన్లు, ఈనెల 5వ తేదీన ఉదయం 10 గంటల నుంచి హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేటలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహిస్తారు. వచ్చే విద్యార్థినులు అన్ని ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీని తీసుకొని రావాలని అన్నారు. వివరాలకు 8919948321 నెంబర్‌లో సంప్రదించవచ్చు.

8వ తేదీన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 2: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్ కామ్), రాష్ట్ర ప్రభుత్వ కార్మిక ఉపాధి శిక్షణ కింద తెలంగాణ నుంచి అర్హత, నైపుణ్యం కలిగిన వారు, సెమీస్కిల్డ్ కార్మికులకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి అధికారి సిహెచ్. ఉమారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీన ములుగురోడ్‌లోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆబ్రాడ్, జర్మనీ, జపాన్ దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8125251408, 9100798204లలో సంప్రదించవచ్చని ఆమె సూచించారు.

స్కూల్ బస్సు దిగబోతూ..

- **టైరు కింద పడి ఏడేళ్ల బాలుడి మృతి**
- **డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన**

జనగామ కల్చరల్, ఆగస్టు 2: స్కూలు బస్సు దిగబోతూ వెనక టైరు కింద పడి ఏడేళ్ల బాలుడు మృతి చెందాడు. ఇందుకు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకొని వారిని శాంతింపజేశారు. వివరాల్లోకి వెళితే.. జనగామ మండలం అడవి కేశ్వాపూర్ గ్రామానికి చెందిన బానోతు గణేష్-మంజుల దంపతుల కుమారుడు వరుణ్(7) జిల్లా కేంద్రంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం యథావిధిగా స్కూలుకు వెళ్లి ఇంటికి వస్తూ బస్సు దిగుతుండగా పుస్తకాల బ్యాగు డోర్‌కు తట్టుకొని వెనుక టైరు కింద పడిపోయాడు. డ్రైవర్ మహేందర్ చూసుకోకుండా బస్సును ముందుకు తీసుకెళ్లడంతో వెనక టైరు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరి కొద్ది నిమిషాల్లో ఇంటికి వస్తాడనుకున్న కొడుకు కళ్లెదుటే విగత జీవిగా పడి ఉండడం చూసి తల్లిదండ్రులు గుండెలు బాదుకున్నారు. పోలీసులు బస్సును సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

బస్సు అద్దాలు ధ్వంసం..

ఈ ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బంధువులు, కుటుంబసభ్యులు అక్కడకు చేరుకొని బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. విద్యార్థి బస్సు దిగకుండానే డ్రైవర్ బస్సు నడపడంతో బాలుడు మరణించాడని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని, కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన నిర్వహించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ రఘుపతిరెడ్డి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి మృతదేహాన్ని జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించారు.



సంఘటనా స్థలం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు, పరిశీలిస్తున్న సీఐ

పీడీఎస్ బియ్యం పట్టుకున్న పోలీసులు

▸▸ 125 క్వింటాళ్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బియ్యం

వరంగల్ క్రైం, ఆగస్టు 2: జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం సౌరారం గ్రామంలోని రైస్‌మిల్‌లో నిల్వ ఉంచిన రూ.3లక్షల 12వేల విలువ కలిగిన పీడీఎస్ రైస్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిసర గ్రామాల్లో సేకరించిన పీడీఎస్ రైస్‌ను డి.రమేశ్ అనే వ్యక్తి రైస్‌మిల్‌లో నిల్వ చేసినట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ శరత్ ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు చేశారు. రైస్‌ను స్వాధీనం చేసుకుని రమేశ్‌ను అదుపులోకితీసుకుని విచారణనిమిత్తం జఫర్‌గడ్ పోలీసులకు అప్పగించారు.

కోత యంత్రం తగిలి వ్యక్తి మృతి

▸▸ చెట్టు కొమ్మలు/ కోస్తుండగా ప్రమాదం

చిట్యాల, ఆగస్టు 2: కోత యంత్రం సహాయంతో చెట్టు కొమ్మలు తొలగిస్తుండగా ప్రమాదవశత్తు వ్యక్తికి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని గోపాలపరం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సాదువెల్లి పైడయ్య(55) సొంతంగా కోత యంత్రం కొనుగోలు చేసి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో చెట్లు కోసేందుకు కూలీకి వెళ్తుంటాడు. కాగా గ్రామంలోని ఓవ్యక్తి ఇంటి వద్ద చెట్టు కొమ్మను తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు యంత్రం పైడయ్య ఛాతికి తగలడంతో తీవ్ర రక్తస్రావమైంది. ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడని తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు ఉన్నాడు.

అగ్నిమాపక శాఖలో జిల్లాలకు ఫైర్‌మన్‌ల కేటాయింపు

మట్టెవాడ, ఆగస్టు 2: అగ్నిమాపక శాఖలో కొత్తగా చేరి హైదరాబాద్‌లోని అగ్నిమాపక శాఖ శిక్షణ కేంద్రంలో నాలుగు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న ఫైర్‌మెన్‌లకు వివిధ జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు 51 మంది ఫైర్‌మెన్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. వారికి వివిధ జిల్లాల్లో రాష్ట్ర అగ్నిమాపక శాఖ డీసీ పోస్టింగ్ ఇచ్చారు. వరంగల్ జిల్లాకు 18 మంది, హనుమకొండ జిల్లాకు 10 మంది, జనగామ జిల్లాకు 10, మహబూబాబాద్ జిల్లాకు ఇద్దరు, ములుగు జిల్లాకు ఆరుగురు, భూపాలపల్లి జిల్లాకు 5 మంది ఫైర్‌మెన్‌లను కేటాయించారు.

ఉపాధ్యాయుడికి వెంకయ్యనాయుడి ప్రశంస

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 2: హనుమకొండ బ్రాహ్మణవాడలో నివాసముంటున్న హనుమాండ్ల జనార్దన్‌ను మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రశంసించారు. రెండు రోజుల క్రితం దుగ్గొండి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల నుంచి హిందీ ఉపాధ్యాయుడిగా ఆయన ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో ఉపాధ్యాయ దంపతులను పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు కలిసి ఎడ్లబండిపై గ్రామంలో ఊరేగించడం, అడుగడుగునా వారిపై పూలవర్షం కురిపించడం ఆ గురువు పట్ల అద్భుతభక్తి ప్రదర్శించిన తీరు సోషల్ మీడియాలో వైరల్ అయింది. అది ఏకంగా వెంకయ్య నాయుడు దృష్టికి కూడా పోయింది. ఈ క్రమంలో ఆయన తన ట్విట్టర్‌లో ఆ ఉపాధ్యాయుడిని ప్రత్యేకంగా ప్రశంసించడం చర్చనీయాంశంగా మారింది.

మానవరహిత సబ్‌స్టేషన్లుగా రూపాంతరం

▸▸ టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, ఆగస్టు 2: మొదటి దశగా కార్పొరేషన్ పరిధిలోని సబ్‌స్టేషన్లను మానవరహిత సబ్‌స్టేషన్లుగా రూపాంతం చేస్తున్నామని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఎస్ఈ, డీఈ, నోడల్ ఆఫీసర్లతో సీఎండీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. విద్యుత్ అంతరాయాలను కనిష్ట స్థాయికి తీసుకరావాలన్నారు. షెడ్యూల్ మెయింటెనెన్స్ అంత యాప్‌లో పొందపర్చాలన్నారు. కార్పొరేషన్ సబ్‌స్టేషన్ల తర్వాత మున్సిపాలిటీల్లో మానవరహిత సబ్‌స్టేషన్లను సిద్ధం చేస్తామన్నారు. ఫీడర్లకు ప్రత్యామ్నాయసరఫరా, రింగ్‌మైన్‌ల ఏర్పాటు ఉండేటట్లు చూసుకోవాలన్నారు. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకొని వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించడానికి కంకణబద్ధులై పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


వినోద (ఫైల్)

గూడూరు, ఆగస్టు 2 : విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం రాములుతండాలో చోటుచేసుకుంది. ఎస్సై నాగేష్ తెలిపిన వివరాల ప్రకారం. రాములుతండాకు చెందిన నూనావత్ వినోద (35) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇంటిలో పిండిమిల్లు కూడా రన్నింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో పిండిమిల్లుకు సంబంధించిన ప్లగ్‌ను తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త నూనావత్ విజయ్, కుమారుడు మహేష్‌బాబు, కుమార్తె కరుణశ్రీ ఉన్నారు. విషయం తెలుసుకున్న గూడూరు మాజీ ఎంపీపీ నూనావత్ రమేష్‌నాయక్ సంఘటన స్థలానికి చేరుకుని మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు.

మూడు ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ

డోర్నకల్, ఆగస్టు 2 : మునిసిపల్ కేంద్రంలో గురువారం రాత్రి పార్కింగ్ చేసి ఉన్న మూడు ట్రాక్టర్లకు సంబంధించిన బ్యాటరీలు చోరీకి గురైనట్లు యాజమానులు సకినాల వెంకన్న, రోహిత్, కోడి యాకయ్య తెలిపారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. గురువారం రాత్రి ఎప్పటిలాగే పనులు ముగించుకున్న తర్వాత తమతమ ఇంటి సమీపంలో ట్రాక్టర్లను పార్కింగ్ చేసినట్లు చెప్పారు. మరుసటిరోజు శుక్రవారం ఉదయం వచ్చి ట్రాక్టర్లు స్టార్ట్ కాకపోవడంతో అనుమానం వచ్చి బ్యాటరీలను చూశారు. బ్యాటరీలు లేకపోవడంతో చోరీకి గురైనట్లు తెలిపారు. ఈ బ్యాటరీల విలువ సుమారు రూ. 21 వేలు ఉంటుందని బాధితులు వెల్లడించారు. ఈ విషయమై డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

బయ్యారం, ఆగస్టు 2 : మండలంలోని కొత్తపేట కొమురంభీం కాలనీలో శుక్రవారం దారం వీరస్వామికి చెందిన గుడిసె విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. అగ్నిప్రమాదంలో వీరస్వామి ఇంట్లోని వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయి. నిరుపేద అయిన వీరస్వామి నిలువ నీడలేకుండా పోయింది.

మహబూబాబాద్ ఆర్టీసీ కాలనీలో చోరీ

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 2 : జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాలనీలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. తులం బంగారం, 30 తులాల వెండి అభరణాలతో పాటు రూ.90 వేలనగదు అపహరణకు గురైనట్లు బాధితురాలు సుష్మిత శుక్రవారం తెలిపారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. ఆర్టీసీ కాలనీకి చెందిన బండి నరేష్ 12 రోజుల క్రితం ఇంటికి తాళంవేసి తొర్రూరు మండలం కంఠాయపాలెంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఇంటికి వేసిన తాళం పగుల గొట్టి ఉండడం గమనించిన వారు ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో దాచిన తులం బంగారం, 30 తులాల వెండి అభరణాలతో పాటు రూ.90 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. క్లూజ్‌టీం బృందం వచ్చి ఘటన జరిగిన ప్రదేశంలో వేలిముద్రలను సేకరించారు.

మానుకోట సీడీపీవోగా శిరీష బాధ్యతల స్వీకరణ

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 2 : మహబూబాబాద్ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ (సీడీపీవో) అధికారిణిగా శిరీష శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో మరిపెడ సీడీపీవోగా విధులు నిర్వహిస్తున్న శిరీషను మహబూబాబాద్‌కు బదిలీ చేయగా, ఇక్కడ ఇన్‌చార్జ్ సీడీపీవోగా విధులు నిర్వహిస్తున్న ఏసీడీపీవో విజయను తొర్రూరు ఏసీడీపీవోగా బదిలీ చేశారు.


డోర్నకల్ పట్టణంలో


చిన్నగూడూరులో


కొత్తగూడలో ర్యాలీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


మానుకోటలో మందకృష్ణ మాదిగ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

వర్గీకరణపై ఎమ్మార్పీఎస్ సంబురాలు

• మందకృష్ణ మాదిగ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 2 : మానుకోట పట్టణంలో హోలియో దాసరి సంఘం ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ ఉద్యమ నేత మంద కృష్ణమాదిగ ఫ్లెక్సీకి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా హోలియో దాసరి సంఘం రాష్ట్ర నాయకుడు తోట అంబరీష, జిల్లా అధ్యక్షుడు దానబోయిన లక్ష్మీనారాయణ మాట్లాడారు. వర్గీకరణ కోసం గత 30 సంవత్సరాలుగా మందకృష్ణమాదిగ అలుపెరగని ఉద్యమాలు చేసి సాధించారని చెప్పారు. వర్గీకరణతో మాదిగ, ఉపకులాలకు మేలు జరగనుందన్నారు. రాములు, నర్సింహా, రామకృష్ణ, రమేష్, చిన్న శ్రీను, రాంబాబు, వినయ్, సమ్మయ్య, బాలకృష్ణ, బుజ్జయ్య, మధు, ఉప్పలేష్, రవి, శ్రీను, నాగరాజు, అనిల్ పాల్గొన్నారు.

● డోర్నకల్ : ఎస్సీ వర్గీకరణను రాష్ట్రప్రభుత్వాలు చేపట్టే హక్కు ఉందని సుప్రీంకోర్టు తీర్పు వెలువడించడం చారిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్ నాయకుడు పుట్టల వెంకటేశ్వర్లు మాదిగ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును హర్షిస్తూ డోర్నకల్ మెయిన్‌రోడ్డులో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీసెంటర్‌లో మంద కృష్ణమాదిగ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. వీరదాసు లక్ష్మణ్, కనకం బాబు, సోమారపు వీరస్వామి, మేకల రామారావు, వీరస్వామి, విలియమ్స్, కందుల మధు, కనకం రవి, గాజుల వేణు, కృష్ణ, కొండేటి చంద్రశేఖర్, రమణ, వెంకటేశ్వర్లు, గాజుల మల్లయ్య, పేరాల నర్సయ్య, బోరగళ్ల రమేష్, శరత్, మురళి, కొత్తపల్లి వెంకన్న, శ్రీనివాస్, అన్నపూర్ణ, రాణి తదితరులు పాల్గొన్నారు.

● చిన్నగూడూరు : మండలంలోని అన్ని గ్రామాల్లో దళిత ప్రజా సంఘాల, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంద కృష్ణమాదిగ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శాగంటి రమేష్ మాట్లాడారు. నాయకులు కంచనపల్లి రమేష్, ప్రశాంత్, నరసయ్య, రాములు, శ్రీను, వెంకన్న, మల్లయ్య, బెడద మధు, ఎల్లయ్య, తిరుపయ్య, భిక్షం, వీరన్న, మైసయ్య, బాలకృష్ణ, అశోక్, ప్రవీణ్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

● కొత్తగూడ : వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, బేడబుడగ జంగాల సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడలో సంబురాలు నిర్వహించుకున్నారు. డప్పుచప్పుళ్ల మ్రోగిస్తూ, నినాదాలు చేస్తు, బాణాసంచా కాల్చుతూ ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ విగ్రహం వద్ద మౌనం పాటించి మాదిగ పోరాట అమరవీరులకు నివాళులు అర్పించారు. అంబేద్కర్ విగ్రహనికి, మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్వీట్లు పంచుకున్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మిడతపల్లి యాకయ్య, నాయకులు కేదాసు ప్రసాద్, గుగ్గిళ్ల వెంకన్న, బాల్య శంకర్, మిడతపల్లి రవి, తీగల ప్రేమ్‌సాగర్, మచ్చ సూరయ్య, దార చిరంజీవి, బొజ్జ జంపయ్య, రూపిక నర్సయ్య, చింత సుధాకర్, అనిల్, రాయుడు, రాంబాబు, బుడగ జంగాల నాయకుడు పస్తం ఎల్లయ్య, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

'వర్గీకరణతో మాలలకు అన్యాయం'

నెల్లికుదురు, ఆగస్టు 2 : ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం జరిగిందని జాతీయ మాలమహానాడు మండల అధ్యక్షుడు కారం ప్రశాంత్ తెలిపారు. మండల కేంద్రంలో శక్రవారం చలో ఢిల్లీ సామాజిక చైతన్య దీక్షల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ తీర్పు ఆర్టికల్ 14 సమానత్వానికి భంగం కలిగిందన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బానాల సంజీవ, శ్రీకాంత్, గార అనిల్, అమిన్, వరుణ్, పాల్గొన్నారు.

ఏసీబీ వలలో పర్వతగిరి ఎస్సై

పర్వతగిరి(వరంగల్ జిల్లా), ఆగస్టు 2 : ఓ కేసులోని నిందితులకు స్టేషన్‌బెయిల్ మంజూరు చేసేందుకు లంచం తీసుకుంటూ వరంగల్ జిల్లా పర్వతగిరి ఎస్సై గుగులోతు వెంకన్న ఏసీబీ అధికారులకు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య కథనం ప్రకారం. పర్వతగిరి మండలంలోని అన్నారంషరీఫ్ మీదుగా గతనెల 27 రాత్రి ఓ ట్రాలీ ఆటోలో నల్లబెల్లం, పటిక తరలిస్తుండగా ఎస్సై వెంకన్న ఆధ్వర్యంలో పెట్రోలింగ్ పోలీసులు దాడులుచేసి పట్టుకున్నారు. వాటిని తరలిస్తున్న సంగెం మండలం చింతలపల్లి కి చెందిన బెల్లం వ్యాపారి బాదావత్ భాస్కర్, డ్రైవర్ రాజేష్, వర్కర్ రవిపై కేసు నమోదు చేశారు. అయితే వారిని జ్యుడీషియల్ కస్టడీకి పంపకుండా, 35 క్లాజ్ (బీ) బీఎన్ఎస్ యాక్ట్ కింద నోటీసులు ఇవ్వకుండా వారిని పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పించుకున్నాడు. ఈ క్రమంలో అజ్మీరా వెంకట్ అనేవ్యక్తి ద్వారా విషయం గురించి బాధితులు ఆరా తీయగా రూ.70వేలు ఇస్తే స్టేషన్ బెయిల్ ఇస్తానని, లేదంటే వారిని జైలుకు పంపుతానని ఎస్సై స్పష్టం చేశారు. అయితే తమ వద్ద ప్రస్తుతం అంత డబ్బులేదని చెప్పడంతో రూ.20 వేలను ఓ ప్రైవేటు వ్యక్తి ద్వారా ఎస్ఐ ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. మిగతా రూ.50వేలు కూడా ఇస్తేనే నోటీసులు ఇస్తానని, లేకపోతే జైలుకు పంపిస్తానని హెచ్చరించడంతో బాధితుడు బాదావత్ భాస్కర్ ఏసీబీ కార్యాలయంలో అధికారులను సంప్రదించాడు.

దీంతో శుక్రవారం అధికారులు పథకం ప్రకారం రూ.40వేలు ఇస్తామని నిందితుడు భాస్కర్ ద్వారా ఎస్సైకి ఫోన్ చేయగా, ఆయన తన డ్రైవర్ సదానందంకు ఇవ్వాలని సూచించాడు. ఎస్సై చెప్పినట్టు డ్రైవర్‌కు డబ్బులు ఇవ్వగా అతడు వాటిని తీసుకుని ఎస్ఐ ఆఫీసుకు వెళ్లాడు. ఏసీబీ అధికారులు పథకం ప్రకారం దాడిచేసి డ్రైవర్ సదానంతోపాటు, ఎస్సై వెంకన్నను అదుపులోకి తీసుకున్నారు. వీరిని శనివారం వరంగల్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్టు డీఎస్పీ వెల్లడించారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్లు ఎల్.రాజు, ఎస్.రాజు, శ్యాంసుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబీమాకు మరో రెండ్రోజులే

• మండల వ్యవసాయాధికారి తిరుపతిరెడ్డి

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 2 : రైతుబీమాకు దరఖాస్తు చేసుకునేందుకు ఇంకా రెండ్రోజులే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి ఎన్.తిరుపతిరెడ్డి తెలిపారు. మానుకోటలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతుబీమా చేసుకోవడానికి చివరి తేదీ ఈనెల 5న అని చెప్పారు. 2024 జూన్ 28 తేదీలోపు కొత్తగా వచ్చిన పట్టాదారులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని,అందుకోసం దరఖాస్తు ఫారంతో పాటు రైతుపట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్, రైతు ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డుతో 59 ఏళ్లలోపు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 2 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లోని వివిధ ట్రేడుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు 2024-25 విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాలు పొందేందుకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మహబూబాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండోదఫాలో సీట్లు రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వెబ్‌ఆప్షన్ల ద్వారా సీట్లభర్తీ ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 12న చివరి తేదీగా నిర్ణయించారని, ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు

లయన్స్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ


పండ్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కేసముద్రం, ఆగస్టు2 : కేసముద్రం పీహెచ్‌సీలో శుక్రవారం మామిడి అశోక్ అధ్యక్షతన కొనసాగుతున్న లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ మాజీ గవర్నర్ ఎన్. వెంకటేశ్వర్‌రావు పుట్టిన రోజు సందర్భంగా రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. డాక్టర్ నంబికిషోర్, పాస్ట్ జడ్‌సీ యర్రం శ్రీరాములు, బెజ్జం ప్రేమ్‌కుమార్, చింతా కరుణాకర్, ముదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మదిపెద్ది వెంకటేష్, కోశాధికారి లక్కాకుల సత్యనారాయణ పాల్గొన్నారు.

రాంచంద్రారెడ్డి విగ్రహానికి కేటాయించిన భూమిని కాపాడాలి

• మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 2 : కలెక్టరేట్ సమీపంలోని కురవి రోడ్‌లో మాజీమంత్రి నూకల రాంచంద్రారెడ్డి విగ్రహ ఏర్పాటు కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలం అన్యాక్రాంతమవుతుందని, దానిని కాపాడాలని మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం, ఆర్డీవో, మునిసిపల్, తహసీల్ కార్యాలయాల్లో శుక్రవారం వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ రాంచంద్రారెడ్డి విగ్రహం ఏర్పాటు కోసం పట్టణంలోని సర్వేనెంబర్ 371/1లో గత ప్రభుత్వం భూమిని కేటాయించిందని చెప్పారు. అయితే అందులో కొంతభూమి ఆక్రమణకు గురైందని తెలిపారు. దీనిపై సమగ్రవిచారణ జరిపి భూ ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఎస్సైని కలిసిన తుడుందెబ్బ, కాంగ్రెస్ నాయకులు


ఎస్సై కుశకుమార్‌కు శాలువా కప్పుతున్న తుడుందెబ్బ నాయకులు

కొత్తగూడ, ఆగస్టు 2 : నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై కుశకుమార్‌నుతుడుందెబ్బ, ఏటీఎఫ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తుడుందెబ్బ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి, ఏటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిద్ధబోయిన భిక్షం, తుడుందెబ్బ నాయకులు అల్లెం జంపయ్య, సిద్ధబోయిన లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చల్లా నారాయణరెడ్డి, జిల్లా నాయకులు బిట్ల శ్రీనివాస్, కొడం మహేందర్, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డుపై మొక్కలు నాటి నిరసన

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 2 : మునిసిపల్ 30వవార్డు పరిధిలోని హోలియోదాసరి బజారులో శుక్రవారం రోడ్డుపై నిలిచిన నీటిలో స్థానికులు మొక్కలు నాటి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం శాఖ కార్యదర్శి గాడిపెల్లి శ్యామ్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ బురదమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం'ను జయప్రదం చేయాలి

• మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 2 : రాష్ట్రప్రభుత్వం ఈనెల 5 నుంచి 9 వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని స్థానిక మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి సూచించారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛదనం- పచ్చదనం నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాంమోహన్‌రెడ్డి మాట్లాడారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో చేపట్టే పనులకు గాను వార్డుకు రూ.50 వేల చొప్పున కేటాయించి పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, ఏఈలు సురేష్, కుమార్, వార్డు కౌన్సిలర్ దండెబోయిన బుజ్జివెంకన్న, మార్నేని రఘు పాల్గొన్నారు.

రూ.520 ప్రీమియంతో రూ.10 లక్షల బీమా

• పోస్టల్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సుచెందర్


మాట్లాడుతున్న సుచెందర్

కేసముద్రం, ఆగస్టు2 : తపాల కార్యాలయంలో రూ.520ప్రీమియం చెల్లిస్తే ఏడాదిపాటురూ.10లక్షలు, రూ.749తో రూ.15లక్షల బీమా సౌకర్యం ఉందని నర్సంపేట సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుచెందర్ తెలిపారు. కాట్రపల్లిలో శుక్రవారం డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా పోస్టాఫీసు పథకాలపై అవగాహన కల్పించారు. పోస్టు మాస్టర్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ దస్రూనాయక్, హెచ్ఎం వీరభద్రయ్య, కార్యదర్శి ప్రవీణ్, జల్లె యాకాంబ్రం, రవీందర్, పోస్టుమాస్టర్లు బొబ్బ శ్రీనివాస్‌రెడ్డి, చందా గోపి, పింగిళి మల్లయ్య, కోతి వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

మహబూబాబాద్‌టౌన్, ఆగస్టు 2 : పట్టణంలో నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో మువ్వన్నెల జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో ఆయన ఫ్లెక్సీకి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతాజీ సేవా సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ కందుల నాగరాజు, మైస రోహిత్ మాట్లాడారు. మువ్వన్నెల జెండా రూపకర్త మన తెలుగు వారు కావడం మనందరికి గర్వకారణమన్నారు. కుదురుపాక వివేక్, గంగాధర్, ప్రవీణ్ సత్యప్రసాద్, వెంకన్న, సత్యనారాయణ, రుద్రాన్ కార్తికేయ పాల్గొన్నారు.

● కేసముద్రం : జాతీయ పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమర యోధుడు పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కేసముద్రం విలేజి శ్రీవివేకవర్ధిని హైస్కూల్లో కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిర్ర నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిష్టాపురంలో వైద్యశిబిరం

బయ్యారం, ఆగస్టు 2 : మండలంలోని కిష్టాపురంలో శుక్రవారం గంధంపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. వైద్య సిబ్బంది పవన్, కళావతి, సునీత పాల్గొన్నారు.

సీఎం కృతజ్ఞత సభకు తరలిన టీచర్లు

డోర్నకల్, ఆగస్టు 2 : దీర్ఘకాలంగా ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని గత కొన్నేళ్లుగా చేసిన ఉద్యమ ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయబదిలీలు, పదోన్నతులు చేపట్టిందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నామ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో శుక్రవారం శుక్రవారం నిర్వహించే సీఎం కృతజ్ఞత సభకు డోర్నకల్ నుంచి ఉపాధ్యాయులు తరలివెళ్లారు. అబ్దుల్ అజీజ్, సీనియర్ నాయకులు కాసు మారెడ్డి, తుమ్మ వెంకటప్పయ్య, రాములు, నిజామియా, ప్రతాపని సత్యనారాయణ, సాహెబ్‌అలీ, హచ్యనాయక్, సీతారాములు, దస్తగిరి ఉన్నారు.

'వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలి'

డోర్నకల్, ఆగస్టు 2 : డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో సురక్షితమైన తాగునీటి కోసం వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకుడు గంధసిరి జ్యోతిబసు మాట్లాడుతూ విద్యార్థులు బోరు నీటినే తాగుతున్నారని, దీనివల్ల వారికి అనారోగ్యసమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. వెంటనే అధికారులు హాస్టల్‌లో వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయికుమార్, అక్షయ్, నరేందర్, వినయ్ పాల్గొన్నారు.

రిజర్వేషన్లు దక్కడం హర్షణీయం

కురవి, ఆగస్టు 2 : సుప్రీంకోర్టు మాదిగ సామాజిక వర్గానికి కల్పించడం హర్షనీయమని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దైద భద్రయ్య, కిన్నెర మల్లయ్య అన్నారు. కురవిలో సుప్రీంకోర్టు నిర్ణయం పట్లహర్షం వ్యక్తం చేస్తూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగల పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. మిర్యాల శ్రీనివాస్, కిన్నెర ఉపేందర్, ఇరుగు సత్యం, ఉప్పలయ్య పాల్గొన్నారు.

మహిళా ప్రగతితోనే సమాజాభివృద్ధి

పెద్దవంగర, ఆగస్టు 2 : మహిళ ప్రగతితోనే సామాజాభివృద్ధి సాధ్యమని డీపీఎంలు గడ్డం శ్రీనివాస్, చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో శ్రీతులసి మండల మహిళ సమైఖ్య ఆధ్వర్యంలో 8వ మహాసభలను శ్రీతులసి మండల సమైక్య అధ్యక్షురాలు రేణుక అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ మహిళలు ప్రభుత్వం అందిస్తున్న స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. ఆర్‌ఎం మధు, శ్రీనిధి, మేనేజర్ సంధ్య, ఏపీఎం రమణచారి, సీసీలు సుధాకర్, సుజాత, పద్మమ్మ, ఆశాలత, అనిల్, వీవోలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తగా ఉండాలి : డీఈ

తొర్రూరు రూరల్, ఆగస్టు 2 : రైతులు వర్షకాలంలో విద్యుత్ పట్ల జాగ్రత్తగా ఉండాలని తొర్రూరు విద్యుత్ శాఖ డీఈ మధుసూదన్ అన్నారు. శుక్రవారం విద్యుత్‌శాఖ పొలంబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని హరిపిరాలలో పర్యటించి ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ల వద్దకు స్వయంగా వెళ్లి రైతుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏడీఈ చలపతిరావు, ఏఈ యాకన్న, స్థానిక సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భక్తులకు వసతుల కల్పనే ధ్యేయం

• జడ్పీటీసీ తేజావత్ శారదరవీందర్‌నాయక్

మరిపెడ రూరల్, ఆగస్టు 2 : దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పని చేస్తానని జడ్పీటీసీ తేజావత్ శారదరవీందర్‌నాయక్ అన్నారు. శుక్రవారం తానంచర్ల శివారు పాలేరు వాగు ఒడ్డున వెలిసిన గంగాభవాని ఆలయం వద్ద జడ్పీటీసీ నిధుల కింద రూ.3 లక్షల వ్యయంతో సోలార్ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకుడు దిగజర్ల ముఖేష్, ఆలయ పూజారి లింగన్న, బాలాజీ పాల్గొన్నారు.

దళితబంధు ఇవ్వాలని..

వాటర్ ట్యాంక్‌ఎక్కి వ్యక్తి హల్‌చల్


వాటర్ ట్యాంక్‌ఎక్కి నినాదాలు చేస్తున్న కుమారస్వామి

తొర్రూరు, ఆగస్టు 2 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న భగీరథ వాటర్‌ట్యాంక్ ఎక్కి దళితబంధు ఇవ్వాలని, లేనిచో దూకుతానని ఆందోళన చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం. ఇనుగుర్తి గ్రామానికి చెందిన పప్పుల కుమార్ అనేవ్యక్తి వాటర్ ట్యాంక్ ఎక్కి. గతంలో మాజీ మంత్రి దయాకర్‌రావు తనకు దళితబంధు ఇస్తానని హామీ ఇచ్చాడని, దళితబంధు ఇవ్వాలని లేనిచో ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దయాకర్‌రావు వచ్చి దళితబంధు ఇస్తానని తెలిపేంతవరకు ట్యాంక్ దిగనని ఆందోళన చేపట్టాడు. దయాకర్ రావు జిందాబాద్ అంటూ నినాదాలు చేశాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని అతనితో మాట్లాడి కిందికి దించారు. దీనిపై ఎస్సై జగదీష్‌ను వివరణ కోరగా ప్రజలకు అసౌకర్యాన్ని గురిచేయడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరిపైనైనా చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. కుమార స్వామిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

• కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ

నర్సింహులపేట, ఆగస్టు 2 : సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి బెలంకొండ వెంకటరమణ డిమాండ్ చేశారు. అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం మండలంలోని పెద్దనాగారంలో చెలమల్ల వీరస్వామి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు.అనంతరం నర్సింహులపేటలో కల్లుగీత కార్మికసంఘం జెండాను ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగే అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు గునిగంటి మోహన్, మండల అధ్యక్షుడు డొనికని రామన్న, సొసైటీ అధ్యక్షుడు గాడిపెల్లి రవి, బి.ఉప్పలయ్య, మోడెం వెంకన్న, చెలమల్ల భాస్కర్, వెంకన్న, సతీష్, ఉపేందర్, పురుషోత్తం, రమేష్ పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట 10 మంది బైండోవర్

దంతాలపల్లి, ఆగస్టు 2 : సింగితండాకు చెందిన ఐదుగురు గుడుంబా తయారుదారులతో పాటు మండలంలోని దంతాలపల్లి, గున్నేపల్లి, దొనకొండ, వాల్యాతండ, కుమ్మరికుంట్ల తాజా మాజీ సర్పంచులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడుంబా తయారుదారులతో పాటు తాజామాజీ సర్పంచులు ఐదుగురు హైదరాబాద్‌లో ఓ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లకుండా ముందస్తుగా బైండోవర్ చేశామన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

తొర్రూరు, ఆగస్టు 2 : పౌష్టికాహారంతోనే తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ వైద్యురాలు జ్వలిత అన్నారు. శుక్రవారం పట్టణంలోని జంగాల బజారులోని అంగన్ వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాలు ఈనెల 7వ తేదీ వరకు నిర్వహిస్తారని, ప్రతి ఒక్కరూ వారికి అందుబాటులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పాల్గొనాలని తెలిపారు.

గిరిజన జర్నలిస్టులను ఆదుకోవాలి

• జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌కు వినతి

గూడూరు, ఆగస్టు 2 : ఏజెన్సీ మండలాల్లో పనిచేస్తున్న గిరిజన జర్నలిస్టులకు ఆర్థికంగా చేయూత నందించాలని ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లావుడ్య రామునాయక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తేజావత్ రవినాయక్, బానోత్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. తార్యతండాలో 10 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని శుక్రవారం ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి బోడ రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు బానోత్ నర్సింహానాయక్, భూక్య మంగీలాల్, భూక్య నర్సింహా, భూక్య మోహన్, లావుడ్య వెంకన్న పాల్గొన్నారు.

ఎస్టీ కార్పొరేషన్ రుణాలను విడుదల చేయాలి..

ఎస్టీ కార్పొరేషన్ రుణాలను వెంటనే విడుదల చేయాలని జాటోతు హుస్సేన్‌నాయక్‌ను ఎస్టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ రామన్ననాయక్ కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బానోత్ భాస్కర్‌నాయక్, బోడ బాలునాయక్, బోడ మురళీనాయక్ పాల్గొన్నారు.

● జాటోతు హుస్సేన్‌నాయక్‌ను మాజీ ఎంపీపీ నూనావత్ రమేష్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిసిసత్కరించారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకులు మల్లేష్, శ్రీకాంత్, విజయ్, చిన్నా ఉన్నారు.